వైద్యులకు రక్షణ కల్పించాలి



వైద్యులపై దాడులకు పాల్పడే వారి ఆస్తులు స్వాధీనం చేసుకునేలా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రాణాలు పోసే వైద్యులపై దుశ్చర్యలకు పాల్పడటం అమానుషం. ఇలాంటి చర్యలతో వైద్యుల్లో అభద్రతాభావం నెలకొంటుంది. వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. రాత్రి వేళల్లో ఒంటరిగా మహిళా డాక్టర్‌లకు డ్యూటీలు కేటాయించకూడదు. కోల్‌కతా ఘటన మరోమారు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తేవాలి.

–వి.జయకృష్ణప్రవీణ్, పీహెచ్‌సీ వైద్యులు, ముప్పాళ్ల



పోలీసు సిబ్బందికి నైట్ డ్యూటీలు వేయాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాను. వైద్యశాలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలి. కఠిన శిక్షలు అమలు పరచాలి. రాత్రి వేళల్లో పనిచేసే డాక్టర్లకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. పోలీసు సిబ్బందికి వైద్యశాలల్లో నైట్ డ్యూటీలు వేయాలి. అప్పుడే మహిళా డాక్టర్లు, నర్సులు పూర్తి స్వేచ్ఛగా పనిచేయగలుగుతారు.

–డాక్టర్ వెంకటకృష్ణకుమార్, పీహెచ్‌సీ, రాజుపాలెం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతలతో చిన హనిమిరెడ్డి భేటీ



క్రోసూరు: అద్దంకి నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పానెం హనిమిరెడ్డి ఆదివారం రాత్రి తన స్వగ్రామం దొడ్లేరుకు వచ్చారు. పార్టీ నాయకులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతుతో అద్దంకి నియోజకవర్గ ప్రజలు తనకు పూర్తి సహకారం అందించారన్నారు. వారికి తన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేస్తానన్నారు. హనిమిరెడ్డిని కలుసుకున్నవారిలో సయ్యద్ అబ్దుల్ రహీం, సయ్యద్ సైదా, అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సయ్యద్ మస్తాన్ వలి, ఖాజామోహిద్దీన్, మర్రి శ్రీనివాసరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, వేమారెడ్డి, సయ్యద్ బాల్ సైదా తదితరులున్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



క్రోసూరు. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఊటుకూరు వైద్య శిబిరంలో 66 మందికి వైద్య పరీక్షలు చేయగా ఆరుగురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారణ చేశారు. బయ్యవరంలో 36 మందికి వైద్య పరీక్షలు చేయగా ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారించి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాల్లో ఏఎన్ఎం లక్ష్మీ, బయ్యవరంలో ఏఎన్ఎం మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్ ప్రేమరాజు, ఎంఎల్‌హెచ్‌పీ శివుడు,ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో ఓక్ బ్రిడ్జి విద్యార్థుల విజయకేతనం



మాచర్ల రూరల్: కృష్ణాష్టమి పండగ పురస్కరించుకుని తెలుగు స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ వారు గుంటూరులో నిర్వహించిన పోటీలలో ఓక్ బ్రిడ్జ్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ లక్ష్మి తెలిపారు. రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో యు.ఎ.19లో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి తీర్థు, 8వ తరగతి అయన్, 3వ తరగతి బాలబోయిన కృష్ణసాయి గౌతమ్‌లు బహుమతులు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ అవసరమని వారి మానసిక, శారీరక దృఢత్వానికి, మైండ్ గేమ్ చెస్‌లో ప్రావీణ్యం సాధించటం పట్ల ఆమె చెస్ కోచ్ కిరణ్‌ని అభినందించారు.

నర్సరీ బాట పట్టినారు..

- ఉద్యాన పంటల నారు బాధ్యత నర్సరీలకు
- సమయం ఆదాతో పాటు నాణ్యమైన మొక్కలు
- నారు మడులకు స్వస్తి చెప్పే పనిలో రైతులు
- గుర్తింపు ఉన్న నర్సరీలోనే కొనుగోలుకు అధికారుల సూచనలు



నర్సరీలో పెంచుతున్న నారు

బెల్లంకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఉద్యాన పంటల సాగు హడావుడిలో రైతన్నలు బిజీగా ఉన్నారు. మిర్చి, టమాట, వంగ, క్యాబేజీ, బంతి పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. సీజన్ ప్రారంభం కావడంతో కొంతమంది సొంతంగా నారు పోసుకోగా.. ఎక్కువ మంది నారు కోసం నర్సరీల వైపు పరుగులు తీస్తున్నారు. గతంలో రైతులు సొంతంగా నారు పోసుకోవడం, దిగుబడిలో కొంత మొత్తం విత్తనంగా ఉపయోగించేవారు. లేదంటే ఇతర రైతుల నుంచి విత్తనాలు, నారు తీసుకొని పంటలు సాగు చేసేవారు. ప్రస్తుతం హైబ్రీడ్ విత్తనాలు దుకాణాల్లో విక్రయిస్తున్నారు. నారు కోసం షెడ్ నెట్ నర్సరీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో సమయం, ఖర్చు ఆదా అవుతోందని రైతులు చెప్తున్నారు.

నియోజకవర్గంలో సాగు ఇలా..

పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో దాదాపుగా 9,800 హెక్టార్లలో మిర్చి, 380 హెక్టార్లలో టమాటా, 550 హెక్టార్లలో ఇతర కూరగాయల పంటలు సాగవుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఇందులో దాదాపుగా 30 శాతం రైతులు సొంతంగా నారు పోసుకున్నారు. మిగిలిన రైతులు నర్సరీల్లో విత్తనాలు ఇచ్చి పెంచుకోవడం లేదా అప్పటికప్పుడు నారు కొనుగోలు చేస్తున్నారు. నర్సరీలలో శాస్త్రీయ పద్ధతుల్లో పెంచడం వల్ల నారు ఒకే ఎత్తులో ఉంటోంది. మోతాదులో సూర్యరశ్మి, నీరు అందించి పెంచడం వల్ల ఇవి నాణ్యత కలిగి ఉంటాయి.

మొక్కను బట్టి ధర...

నియోజకవర్గంలోని మండలాల్లో వ్యవసాయ ఆధారిత గ్రామాలే ఉన్నాయి. టమోటా సాగుకు ఎకరాకు 15 వేల మొక్కలు, మిర్చికి సుమారుగా 20 వేల మొక్కలు అవసరమవుతాయి. టమాటా మొక్క 80 పైసల నుంచి రూపాయి వరకు ధర పలుకుతోంది. మిర్చి నారు మేలైన రకం ఆధారంగా రూపాయి నుంచి రెండు రూపాయల వరకు నర్సరీల వద్ద విక్రయిస్తున్నారు. నర్సీల్లో పెంచుకునే వారు ఒక్కో మొక్కకు 50 పైసల నుంచి 80 పైసల వరకు చెల్లిస్తున్నారు. 40 రోజుల తర్వాత మొక్కలను తీసుకుని పొలంలో నాటుకుంటున్నారు. దీంతో కూలీల ఖర్చులు కూడా తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు.

సమయం ఆదా



ఖరీఫ్‌లో మూడు ఎకరాల్లో మిరప సాగు చేసేందుకు పొలం సిద్ధం చేశాను. నారు కోసం విత్తనాలు కొని, నర్సరీ నిర్వాహకులకు ఇచ్చాను. గతంలో స్వయంగా నారుమడి వేసేవాడిని. మొలక శాతం తక్కువగా రావడం, నారు చనిపోవడం జరుగుతుండేది. నర్సరీలో నారు పెంచడం ద్వారా సమయం ఆదా అవ్వడంతో పాటు, నాణ్యమైన నారు వస్తుంది.

– మేకల వెంకటేశ్వర్లు, రైతు, వన్నాయపాలెం,

గుర్తింపు ఉన్న నర్సరీల్లోనే..



రైతులు నారు కొనేటప్పుడు వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. విత్తనాలు సర్టిఫైడ్ కంపెనీవి తీసుకోవాలి. షేడ్ నెట్‌లో తీసుకున్న నారు నాణ్యంగా ఉంటుంది. నారు మడుల్లో మొక్కల్లో హెచ్చుతగ్గులుండి, కలుపు సమస్య ఉంటుంది. నర్సరీలలో అలాంటి సమస్యలు ఉండవు.

– వై.మోహన్, ఉద్యాన శాఖాధికారి, పిడుగురాళ్ల డివిజన్

మహిళల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయం

బెల్లంకొండ: మహిళల ఆర్థిక అభ్యున్నతే ధ్యేయంగా 'లక్‌పతి దీదీ యోజనను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వెలుగు ఏపీఎం ఉషశ్రీ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో లక్ పతి దీదీ యోజనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచి, ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళా సంఘాలలో ఉన్న ప్రతి మహిళకు రూ.5 లక్షల వరకు ఈ పథకం ద్వారా వడ్డీ లేని రుణాలను బ్యాంకుల నుంచి అందిస్తారని తెలిపారు. మండల సమైక్య అధ్యక్షులు హజరబి, జగ్గమ్మ, సీసీలు అంకమ్మరావు, రామస్వామి, జమాల్ సైదా తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను ఉపసంహరించుకోవాలి

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను బలవంతంగా రుద్దాలని చూస్తోందని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని అన్నారు. సత్తెనపల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వాలు ఉద్యోగుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తే దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఉద్యోగ సంఘాలతో కలసి ఓపీఎస్‌ను సాధించుకునే వరకు పోరాడుతామన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌ఘడ్ ఓపీఎస్‌ను అమలుపరుస్తున్నాయన్నారు. కేంద్రం కూడా అన్ని రాష్ట్రాల్లో ఓపీఎస్‌ను పునరుద్ధరించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చలపతిరావుకే మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ?

- కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆమోదంతో లాంఛనమే
- న్యాయవాది అజయ్‌కుమార్‌ను బుజ్జగిస్తున్న సహచరులు



మద్దినేని వెంకట చలపతిరావు



గంగూరి అజయ్‌కుమార్

సత్తెనపల్లి: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మద్దినేని వెంకట చలపతిరావే దాదాపు ఖరారు అయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం . సత్తెనపల్లి మున్సిపల్ కౌన్సిల్‌కు ఆరుగురు న్యాయవాదులు పోటీలో ఉన్నారు. వారిలో ఒకరు బీసీ, మరొకరు మైనార్టీ కాగా మిగిలిన నలుగురు ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారు. అయితే మున్సిపల్ కౌన్సిల్ పదవిని ఇద్దరు న్యాయవాదులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. వారిలో ఒకరు దాదాపు తనకే దక్కుతుందని గట్టి నమ్మకంతో ప్రచారం చేసుకున్నారు. అయితే అది కాస్త ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వద్ద బెడిసి కొట్టింది. ఆయన ముందు నుంచి లీగల్ సెల్ సమావేశం ఏర్పాటు చేసుకొని ఒక పేరును ప్రతిపాదిస్తే ఆ పేరును సిఫార్సు చేస్తానని చెప్పుకొచ్చారు. న్యాయవాది గంగూరి అజయ్‌కుమార్ ఈ మేరకు లీగల్ సెల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమన్వయపర్చుకోలేకపోయినట్లు సమాచారం. దీంతో న్యాయవాది మద్దినేని వెంకటచలపతిరావుకు మున్సిపల్ కౌన్సిల్ ఇచ్చేందుకు కన్నా లక్ష్మీనారాయణ సిఫార్సు చేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మున్సిపల్ కౌన్సిల్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న అజయ్ కుమార్ మనస్థాపం చెందడంతో సహచర న్యాయవాదులు, టీడీపీ నేతలు బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 30, 31న జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అంశం సభ్యుల ఆమోదంతో తెరపడనుంది. అయితే దరఖాస్తుకున్న ఇతరులు భవిష్యత్తులో మరేదైనా మంచి పదవి వస్తుందనే యోచనలో ఉన్నారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అంశం న్యాయవాదుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఘననాథుడి ఆకృతులు

- విగ్రహాల తయారీలో రాజస్థానీయులు
- వివిధ ఆకృతులు, మెరిసే రంగులతో సిద్ధం
- ఇంటి పూజకు మట్టివి.. పందిళ్లకు పీఓపీ ప్రతిమలు



వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా ఉన్న విగ్రహాలు

సత్తెనపల్లి: చవితి ఉత్సవాలకు గణనాథుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వివిధ ఆకృతుల్లో భారీ ప్రతిమలకు తుది మెరుగులు దిద్దే పనిలో రాజస్థానీయులు నిమగ్నమయ్యారు. అధిక సంఖ్యలో విగ్రహాలను చవితి వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వద్ద జాతీయ రహదారి పక్కన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) తో వినాయక ప్రతిమలు రూపుదిద్దుకుంటున్నాయి. మట్టి ప్రతిమలకంటే పీఓపీతో విగ్రహాలే ఆకర్షణీయంగా ఉండటంతో ఉత్సవ కమిటీలు అటు వైపే మొగ్గు చూపుతున్నాయి.

రాజస్థానీయులది అందెవేసిన చేయి

పీఓపీ ప్రతిమల తయారీలో రాజస్థానీలు సిద్ధహస్తులు. జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, గురజాల, మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ తదితర ప్రాంతాలకు విగ్రహాల తయారీకి రాజస్థానీ కుటుంబాలు వలసొచ్చాయి. 20ఏళ్లుగా ఇక్కడే స్థిరపడిన 40కి పైగా కుటుంబాలు వినాయక చవితికి గణపతి ప్రతిమలతో పాటు పాటు వివిధ దేవుళ్ల విగ్రహాలు, ఫ్లవర్ వాజులు, ఇతరత్రా గృహ అలంకరణ వస్తువులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

ఆకర్షణీయంగా...

రాజస్థానీయులు రూపొందించే ప్రతిమలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటున్నాయి. మంచి రంగుల కాంబినేషన్ వినియోగించడంతోపాటు ఏటా నూతన ఆలోచనలతో విభిన్న ఆకృతుల్లో విగ్రహాలు తయారు చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీటి విక్రయాలు కూడా బాగానే ఉన్నాయి. ఈ ఏడాది ఒక్కో ప్రాంతంలో మొత్తం మీద 800 నుంచి వెయ్యి ప్రతిమలు అమ్ముడుపోతాయని ఆశిస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు. మూడు అడుగుల నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నారు.



గణనాథుని విగ్రహానికి రంగులద్దుతున్న కళాకారుడు

క్రైమ్ కార్నర్

రక్తం కక్కుకొని కూలీ మృతి



వెల్దుర్తి: పలుగు, పార చేత బట్టి పనికి వెళ్తూ రక్తం కక్కుకొని అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మాచర్ల పట్టణంలోని 30వ వార్డు బస్టాండ్ వెనుక ప్రాంతంలో సోమవారం జరిగింది. మాచర్ల పట్టణానికి చెందిన ఓర్సు సుంకయ్య (70) ప్రతి రోజూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఉదయం పలుగు, పార చేతబట్టి ఇంటి నుంచి పనికి బయలుదేరాడు. ఇంటికి కొద్దిదూరంలోనే రక్తం కక్కుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య నక్షత్రం, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ ఘటన చూసిన ఆ ప్రాంత వాసులు చలించిపోయారు.

కంకర లారీ కింద పడి మరో కూలీ..

ఈపూరు: ప్రమాదవశాత్తు కంకర లారీ కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొండ్రముట్ల సమీపంలోని నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచరులో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు మేరకు వెంచరులో సిమెంటు పనులు చేస్తుండగా పనులు చేస్తున్న బొల్లాపల్లి మండలం బోలాయపాలెం గ్రామానికి చెందిన నేరేళ్ళ శ్రీనివాసరావు (40) కంకర లారీ వెనకకు తిప్పుతిండగా ప్రమాదవశాత్తు లారీ టైర్ల కింద పడి శరీరం గుర్తు పట్టని విధంగా నుజ్జునుజ్జయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఉమామహేశ్వరరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నా రు. మృతదేహాన్ని చూసి చాటి కూలీల సైతం అయ్యో పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.కేసు దర్యాప్తులో ఉంది.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని పాఠశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం అప్పాపురం గ్రామానికి చెందిన దుప్పలపూడి శివబాబు (43) సోమవారం వ్యక్తిగత పనులపై చిలకలూరిపేటకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా నరసరావుపేట ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి. అప్పాపురం వైపు మలుపు తిప్పే క్రమంలో ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొంది. తీవ్ర గాయాలైన శివ బాబును ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ముప్పాళ్ల : చాగంటివారిపాలెం పూజలందుకున్న జగన్నాథస్వామి



సత్తెనపల్లి పట్టణంలో ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దేవకి వాసుదేవుల ఎనిమిదో గర్భంగా, శ్రావణ మాసం , కృష్ణ పక్షం, అష్టమి తిథిన కంసుడి చెరసాలలో శ్రీకృష్ణుడు జన్మించినట్లుగా పురాణాలు చెబుతున్నట్లు అర్చకులు భక్తులకు వివరించారు. ప్రాంతాల వారీగా శ్రీకృష్ణాష్టమి, జన్మాష్టమి, గోకులాష్టమి, అష్టమిరోహిణి అనే పేర్లతో పిలుస్తుంటారన్నారు. భక్తులు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం శ్రీకృష్ణుని పూజించారు. శ్రావణ మాసంలో లభించే పండ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యంగా మమర్పించారు. ఊయల కట్టి అందులో శ్రీకృష్ణుని ప్రతిమనుంచి ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు ఆలపించారు. వీధుల్లో ఉట్టి కట్టి సంబరాలు చేసుకున్నారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల అలరించారు.

క్రోసూరు: క్రోసూరులో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు, వేణుగోపాలస్వామి ఊరేగింపు, ఉట్టి కొట్టే వేడుకలు మంగళవారం నిర్వహించనున్నట్లు మండల ఈవో పూర్ణచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



సరస్వతి శిశు మందిరంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



సత్తెనపల్లి శిశుమందిర్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ



బెల్లంకొండ: వెంకటాయపాలెంలో ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు



రాజుపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సత్తెనపల్లిలో ప్రసాదం పంపిణీ

మినుము పైరుకు వైఎంవీ వైరస్



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మినుము పంటను డీడీఏ శివ కుమారి సోమవారం పరిశీలించారు. మినుము పైరుకు వైఎంవీ వైరస్ సోకినట్లు గుర్తించారు. ఎల్లోవేయిన్ మొసాయిక్ వైరస్ నివారించేందుకు రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. తెగులు సోకిన మొక్కలను తొలగించాలన్నారు. వైరస్ నివారణకు పసుపురంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసెటమీప్రైడ్ మందును పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వీరివెంట ఏడీఏ మస్తానమ్మ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
9912225439
Office mail : sakshigntadvt@gmail.com